## చిన్నకథ

# పాప కోరిక



"శ్వేతా"

"..."

"శ్వేతా.. నిన్నే! పిలుస్తుంటే పలకవేం?"

"ఏంటి?"

"అన్నం తిందువురా"

"వద్దు"

"ఎందుకని వద్దు?"

"నాకు వద్దని చెప్పానా"

"అదే ఎందుకు వద్దు అని అడుగుతున్నాను. రోజురోజుకు మరీ మొండిగా తయారవుతున్నావు. నాలుగు తగిలిస్తే గాని నీ తిక్క వదలదు"అంటూ కూతురు దగ్గరకు రాబోయింది రమణి.

తల్లి కొట్టకముందే ఏడుపు లంకించుకుంది ఐదేళ్ల చిన్నారి శ్వేత.

గేటు తీసుకుని లోపలికి వస్తున్న అమ్మమ్మను చూడగానే ఏడుపు ఆపి ఒక్కసారిగా "అమ్మమ్మా" అంటూ రెండు చేతులూ చాపి ఎదురెళ్లింది శ్వేత.

"హాయ్ బంగారూ" అంటూ మనవరాలిని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది మాణిక్యాంబ.

అన్నం తినకుండా మారాం చేస్తున్న కూతురు గురించి తల్లికి ఫిర్యాదు చేసింది రమణి.

"శ్వేత బంగారు తల్లి. చెప్పిన మాట వింటుంది కదూ!" అంటూ పాపను ఒళ్లో కూర్చోబెట్టుకుంది మాణిక్యాంబ.

"ఈ ఫ్రాక్ చాలా బాగుందే! ఎవరు కొనిపెట్టారు?"

"డాడీ కొన్నారు"

"ఎప్పుడు కొన్నారు?"

"నా బర్త్‌డేకి"

"బర్త్‌డే నాడు మీ ఫ్రెండ్స్ అందరికీ చాక్లెట్స్ ఇచ్చావా?"

"ఓ.. బోలెడంతమంది ఫ్రెండ్స్ ఉన్నారు మా స్కూల్లో. పింకీ, రూబీ, నీతూ, ఐష్, శశాంక్ అందరికీ చాక్లెట్స్ ఇచ్చాను. కేక్ ఇచ్చాను" అంటూ గొప్పగా చెప్పింది శ్వేత చేతులు తిప్పుతూ.

"వెరీ గుడ్. నీకో కథ చెప్తాను వింటావా!"

"ఓకే అమ్మమ్మా! కథలంటే నాకు చాలా చాలా యిష్టం" అంది శ్వేత.

పాపను మాటల్లో దించి ఏడుపు మరిపించి అన్నం తినిపించింది మాణిక్యాంబ.

అప్పటి దాకా కూతురికి అన్నం తినిపించటంకోసం అరిచి అరిచి విసుగు చెందిన రమణి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుంది. మాణిక్యాంబ ఉన్న పది రోజులు శ్వేత అమ్మమ్మను వదిలిపెట్టకుండా ఆవిడ కొంగు పట్టుకుని వెంబడే తిరిగింది. ఉదయం లేచిందగ్గరనుంచి బ్రష్ చేసుకోవటం, స్నానం చేయటం, డ్రెస్ వేసుకోవటం, తల దువ్వించుకోవటం, పాలు తాగటం, టిఫిన్ తినటం, అన్నం తినటం అన్ని పనులు అమ్మమ్మ సాయంతోనే చేసేది. ఆఖరికి అమ్మమ్మ జోకొడుతూ పాడుతూనో, కథ చెబుతూనో ఉంటే వింటూ ఆవిడ పక్కనే పడుకుని శ్వేత నిద్రపోయేది.

చంద్రం, రమణి దంపతులకు ఒక్కగానొక్క కూతురు శ్వేత. రమణికి పిల్ల అల్లరి భరించి ఓపిగ్గా బుజ్జగించే ఓర్పు నేర్పు లేవు. పాప నవ్వుతూ ఆడుకుంటూ ఉన్నంత సేపు ఆమెకు బాగానే ఉంటుంది. అల్లరి మొదలెట్టిందంటే అసలు భరించలేదు. ఇప్పుడు మాణిక్యాంబ వచ్చాక చాలా రోజుల తర్వాత ఈ పది రోజులు ప్రశాంతంగా అనిపించింది చంద్రానికి. లేకపోతే ఈ మధ్య శ్వేత అన్నిటికి మొండిగా ప్రవర్తించటం, రమణి అరుపులు కేకలు, పాపను బెదిరించటం.. వీటితో ఇంట్లో రణగొణధ్వనిగా ఉండేది. తను బుజ్జగిస్తే కాసేపు బాగానే ఉండేది శ్వేత. మళ్లీ ఏదో ఒక పేచీ పెట్టి మారాం చేసేది.

మాణిక్యాంబ ఊరెళ్లటానికి ప్రయాణమయింది.

"అమ్మమ్మా, నువ్వు వెళ్లిపోవద్దు. ఇక్కడే వుండిపోవాలి" అంటూ ఏడవటం మొదలు పెట్టింది శ్వేత.

"అయ్యో.. చిట్టితల్లీ. ఏడవకమ్మా! అక్కడ తాతగారు ఒక్కరే వున్నారు కదా! నేను వెళ్లకపోతే ఎలా? పోనీ నువ్వూ నాతో వస్తావా?"

"నేను స్కూలుకు వెళ్లాలి కదా?"

"సెలవుల్లో వద్దువులే" అంటూ అప్పటికి ఎలాగో సర్దిచెప్పింది ఆవిడ. అయినా సాయంత్రం స్కూలునుంచి వచ్చేసరికి అమ్మమ్మ ఊరెళ్లిందని తెలుసుకుని ఏడుస్తూ కూర్చుంది శ్వేత.

రోజులు గడుస్తున్నాయి. మళ్లీ రమణి అసహనంగా అరవటం, శ్వేత పేచీ మామూలయ్యాయి. తల పట్టుకుని కూర్చున్నాడు చంద్రం.

చిన్న పిల్లల ఆలనా పాలనా చూడాలంటే పెద్దవాళ్లు వాళ్లతో కలసి పోవాలి. పిల్లలుగా మారాలి. వాళ్లు చెప్పినట్టు వినాలి. వాళ్లతో జతకట్టాలి. ఆడాలి. పాడాలి. అల్లరి చేయాలి. నవ్వాలి. నవ్వించాలి. కథలు కబుర్లు చెప్పాలి. అలిగినప్పుడు బుజ్జగించాలి. కొట్టకూడదు. తిట్టకూడదు. విసుక్కోకూడదు. ఈ పని చెయ్యి ఆ పని చెయ్యకూడదు అని శాసించకూడదు. చులకనగా చూడకూడదు. మరి ఇంతటి ఓపిక, తీరుబడి, శ్రద్ధ, ఆలోచన ఈ కాలం తల్లుల్లో ఎంతమందికి ఉంది? పసి మనసులను అర్థం చేసుకుంటూ వాళ్ల అవసరాలను ముందుగానే గమనించి తీరుస్తూ వాళ్లతో మమేకమై కంటికి రెప్పలా కాపాడుతూ వాళ్లను సాకగల నైపుణ్యం అమ్మమ్మలు, నాన్నమ్మలకే సొంతం.

ఇప్పుడంతా గడియారంలోని సెకండ్స్ ముల్లుతోపాటు పరుగులు పెట్టేవారే! యంత్రాల సహాయంతో నిమిషాల్లో పనులు ముగించుకున్నట్లే పిల్లలకు సంబంధించిన పనులు కూడా క్షణాల్లో పూర్తి కావాలని అనుకుంటారు.

సరిగా తిండి తినకపోవడం వలన శ్వేత రోజురోజుకు నీరసించి పోతోంది. ఉన్నట్లుండి ఒక రోజు చంద్రం ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా బయటకు వెళ్లాడు.

పాపకోసం తన అత్తగారిని తీసుకు రావటానికి కాదు. భార్య రమణి మాటలకు తలవంచి ఇటీవలే వృద్ధాశ్రమంలో చేర్పించిన తన తల్లిని తిరిగి ఇంటికి తీసుకు రావటానికి.

మాణిక్యాంబ వెళుతూ వెళుతూ అల్లుడితో "బాబూ చంద్రం! నా కూతురు తెలివి తక్కువతనాన్ని మన్నించి వెంటనే మీ అమ్మగారిని ఇంటికి తీసుకురా. నీ కూతురు శ్వేతకు కావలసింది వాళ్ల నాయనమ్మ ప్రేమానురాగాలే! పసిపిల్లను నాయనమ్మ ఒడినుంచి దూరం చేయటం మంచిది కాదు. వాళ్ల నాయనమ్మ ఉంటే పాప సంతోషంగా ఉంటుంది. పాప కోరుకునేది అదే" అని చెప్పింది.

ఆమె సలహాను అమలు పరచటానికి బయలుదేరాడు చంద్రం.

– అబ్బరాజు జయలక్ష్మి